విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 357 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూలై 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|

## రైతు సంక్షేమం పై చర్చిద్దాం రాండి



**ఢిల్లీలో ఉండే మోడి...గల్లీలో ఉండే కేడీ అయినా చర్చకు సిద్దం**

- కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్టు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తమదే
- ఎల్బీ స్టేడియం సామాజిక న్యాయ సమరభేరి సభలో సీఎం రేవంత్

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల -మిగతా 3 లో



## మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం

**ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో తో సత్కారం**

న్యూఢిల్లీ

భారత ప్రధాని నరేంద్ర మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో ' ను శుక్రవారం బహుకరించారు. ఈ దేశం ఓ విదేశీ నేతకు ఈ విశిష్ట గౌరవం ఆపాదించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ కరీబియన్ దేశ పర్యటనలో ఉన్న మోడీ గౌరవార్థం ఇక్కడి ప్రెసిడెంట్ హౌస్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు-అయింది. ప్రధాని మోడీ రాజనీతిజ్ఞత, ఆయన కార్యదక్షత, గ్లోబల్ సౌత్ ప్రాధాన్యతల , రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక బంధం బలోపేతం వంటి పలు అంశాల నేపథ్యంలో ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ క్రిస్టియనే కార్లా కంగలూ మోడీని ప్రశంసించారు.

-మిగతా 3 లో



## ఆత్మాభిమానం మన ఆయుధం

- బ్రిటిష్ వారిని ఈ ఆయుధంతో గడగడలాండించిన అల్లూరి
- ఆయన జీవితం భావి తరాలకు స్ఫూర్తి కావాలి
- అల్లూరి జయంతి సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

చాలా మంది యోధులు చిన్న వయసులోనే స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు వదిలారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి వాళ్ళు ఎంతోమంది తమ ప్రాణాలు వదిలారు.. భారత స్వాభిమానం, తెలుగు రాష్ట్రాల్లోగుర్తుగా నిలిచిపోయారు.. అల్లూరి కేవలం పోరాట యోధుడే కాదు ప్రజలు కోసం అన్ని కోల్పోయిన నాయకుడు గుర్తుకు వస్తాడని అన్నారు. ఎలాంటి ఆయుధాలు -మిగతా 3 లో



## బిజెపి జాతీయ అధ్యక్షురాలుగా మహిళా నేత?

- రేసులో ముగ్గురు సౌత్ నాయకులకే ఛాన్స్..!
- పరిశీలనలో నిర్మల సీతారామన్ పేరు
- దగ్గుబాటి పురందేశ్వరి, వనతి శ్రీనివాస్ పేర్లు కూడా

న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ

బిజెపి పార్టీ పగ్గాలు దక్షిణాది మహిళలు చేపట్టనున్నారా?! అంటే.. అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయి. బిజెపి జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాది మహిళలైన డి.పురంధరేశ్వరి, నిర్మలా సీతారామన్, వనతి శ్రీనివాసన్‌లకు కట్టబెట్టే పనిలో ఆ పార్టీ నేతలు ఆలోచిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నిర్మలా సీతారమన్‌తో ఈ దిశగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఆమె తాజాగా జెపి నడ్డాతోనూ, బిజెపి ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌తోనూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో చర్చలు జరిపారు. ఇక పురంధరేశ్వరిని

-మిగతా 3 లో



## నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

- అత్యుత్తమ వైద్యం అందించాలని సీఎం ఆదేశం

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్వల్ప అనారోగ్యంతో సోమాజీగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తాజాగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులు బులిటెన్ విడుదల చేశారు. కేసీఆర్ నీరసంగా ఉండటంతో ఈ సాయంత్రం ఆస్పత్రిలో చేరారు. ఆయన శరీరంలో బ్లడ్ షుగర్ అధికంగా, సోడియం మోతాదు తక్కువగా

-మిగతా 3 లో



హైదరాబాద్‌లో మాజీ సీఎం

## రోశయ్య విగ్రహం

**లక్డీకాపూల్‌లో ఆవిష్కరించిన మల్లికార్జున ఖర్గే**

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ

నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. రోశయ్య జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వైఎస్ మరణం తరవాత ఆయన సిఎంగా పనిచేశారు. తరవాత తమిళనాడు గవర్నర్‌గా వెళ్లారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేతుల మీదుగా ఆవిష్కరించిన ఈ -మిగతా 3 లో

## గ్రూపులు కడితే సహించబోము

**కాంగ్రెస్ నేతలకు మల్లికార్జున ఖర్గే హెచ్చరిక**


- మీనాక్షితో అంతా సమన్వయం చేసుకోవాలి
- పార్టీ వ్యవహారాలపై బయట మాట్లాడరాదు
- మంత్రుల సమన్వయ లోపంపై సీఎం అసహనం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనా నేతల చర్చ
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో వాడీవేడీగా చర్చ

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో

-మిగతా 3 లో






## ప్రపంచ దేశాలకు కొత్త సుంకాల పై ట్రంప్ లేఖలు

- గడువుకన్నా ముందే నిర్ణయాల వెల్లడి

శ్వేతసౌధం ప్రజా స్వేచ్ఛ


ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై ప్రకటించిన ప్రతీకార సుంకాల వివరాలతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆయా దేశాలకు లేఖలు రాస్తున్నారు. అమెరికాతో ఒప్పందాలకు జులై 9వరకు గడువు ఉన్నా, అంతకంటే ముందే కొత్త టారిఫ్ రేట్లను పేర్కొంటూ లేఖలు రాస్తున్నారు. శుక్రవారం నుంచి తమ వాణిజ్య -మిగతా 3 లో

## తెలంగాణ ప్రయోజనాలపై రాజీపడం

- గతంలోనే పదవులను గడ్డిపోచల్లా వదిలేశాం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ

నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు. పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను -మిగతా 3 లో



# శానిటరీ ప్యాడ్ ప్యాకెట్లపై రాహుల్ గాంధీ ఫొటో


## బీహార్‌లో రాజకీయ దుమారం




పాట్నా -ప్రజా స్వేచ్ఛ
బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ గిమ్మిక్కులు మొదలయ్యాయి. ఆ రాష్ట్ర మహిళల్లో రుతుక్రమం పరిశుభ్రతపై అవగాహన పెంచే ఉద్దేశంతో 'ప్రియదర్శిని ఉడాన్ యోజన' కింద ఉచిత శానిటరీ ప్యాడ్ ప్యాకెట్ల పంపిణీని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. బీహార్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'మై బహిన్ సమ్మాన్ యోజన' కింద నెలకు రూ. 2,500 స్టైఫండ్ హామీకి అనుగుణంగా ఈ డ్రైవ్ చేపట్టింది. ఐదు లక్షలకు పైగా శానిటరీ ప్యాడ్ బాక్స్‌లను మహిళలకు పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ తెలిపింది.కాగా, మహిళలకు ఉచితంగా పంపిణీ చేసే శానిటరీ ప్యాడ్ ప్యాకెట్లపై ప్రియాంక గాంధీతోపాటు రాహుల్ గాంధీ ఫొటోలు ఉన్నాయి. దీంతో రాజకీయ దుమారానికి ఇది తెరలేపింది. మహిళల కోసం ఉద్దేశించిన శానిటరీ ప్యాడ్ ప్యాకెట్లపై రాహుల్ గాంధీ చిత్రం ఎందుకని ప్రత్యర్థి పార్టీలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ పార్టీకి ఏమైందని సీఎం నితీశ్ కుమార్‌కు చెందిన జేడీయూ అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ ఎద్దేవా చేశారు. ఇది ఎన్నికల గిమ్మిక్ అని ఆయన అభివర్ణించారు. మరోవైపు ఎన్డీయే కూటమి పార్టీల విమర్శలను కాంగ్రెస్ నాయకురాలు అల్కా లాంబా తిప్పికొట్టారు. 'రాహుల్ గాంధీ ఫొటో ఈ ప్యాకెట్లపై ఎందుకు ఉన్నాయనేది ప్రశ్న కాదు. ఆధునిక యుగంలోనూ బీహార్‌లోని మన కుమార్తెలు ఇప్పటికీ రుతుక్రమంలో వస్త్రం ముక్కలను ఎందుకు ఉపయోగించాల్సి వస్తున్నది. ఎందుకు అనారోగ్యానికి గురవుతున్నారు అనేది ప్రశ్న. బీజేపీ ఎల్లప్పుడూ మహిళా వ్యతిరేక మనస్తత్వాన్ని కలిగి ఉంది' అని ఆమె విమర్శించారు......

# కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం..

### మూడు జిల్లాల్లో అలెర్ట్




తిరువనంతపురం-ప్రజా స్వేచ్ఛ
కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం రేపుతున్నది. ఇద్దరు వ్యక్తుల్లో నిపా వైరస్ లక్షణాలు గుర్తించారు. దీంతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మూడు జిల్లాల్లో అలెర్ట్ ప్రకటించారు. కోజికోడ్, మలప్పురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు అనుమానిత నిపా కేసులు వెలుగులోకి వచ్చాయి. మలప్పురం, పాలక్కాడ్ జిల్లాలకు చెందిన వ్యక్తుల నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు.కాగా, కేరళలో మరోసారి నిపా వైరస్ వ్యాప్తిపై ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కోజికోడ్, మలప్పురం, పాలక్కాడ్ జిల్లాల్లో ఆరోగ్యపరంగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. కాంటాక్ట్ ట్రేసింగ్, రోగ లక్షణాల గుర్తింపుతోపాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ప్రాంతంలో 26 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఏవైనా అసహజ మరణాలు సంభవించాయా అన్నది తనిఖీ చేయాలని అధికారులను కోరినట్లు వివరించారు.

# సీఎం అభ్యర్థిగా దళపతి విజయ్..

### టీవీకే కీలక ప్రకటన



చెన్నై-ప్రజా స్వేచ్ఛ
తమిళనాడులో హీరో దళపతి విజయ్ గతేడాది రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. తమిళగ వెట్రి కళగం పార్టీ ని స్థాపించారు. 2026 జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు అప్పట్లోనే ప్రకటించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీవీకే పార్టీ తాజాగా కీలక ప్రకటన చేసింది. తమిళగ వెట్రి కళగం పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పార్టీ వ్యవస్థాపకులు విజయ్‌ని ఎన్నుకున్నట్లు ప్రకటించింది.ఇక ఈ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని గతంలోనే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయంపై విజయ్ తాజాగా మరోసారి స్పష్టతనిచ్చారు. బీజేపీ, డీఎంకే, ఏఐడీఎంకే.. ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని తేల్చి చెప్పారు. డీఎంకే, బీజేపీకి తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకమనని అన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలు మద్దతు కూడగట్టేందుకు ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకూ విజయ్ రాష్ట్రవ్యాప్త పర్యటన ఉంటుందని తెలిసింది. తమిళగ వెట్రి కళగం పార్టీని విజయ్ గతేడాది ఫిబ్రవరిలో స్థాపించిన విషయం తెలిసిందే. పార్టీ స్థాపించి ఏడాది పూర్తైన సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో చెన్నైలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన ఆ పార్టీ ఎన్నికల్లో పోటీకి ప్రశాంత్ కిషోర్ సహకరిస్తున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే చెన్నైలో విజయ్‌ను ప్రశాంత్ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు కూడా. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన విజయ్‌కి సూచనలు సలహాలు ఇవ్వనున్నట్లు తెలిసింది. దేశంలో ఇప్పటికే పలు రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్ పనిచేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు టీవీకే పార్టీకి కూడా ఆయన వ్యూహకర్తగా వ్యవహరిస్తుండటంతో.. విజయ్ పార్టీపై తమిళనాట అంచనాలు పెరిగాయి.

# ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు.. రహస్యంగా డీజీసీఏ వార్నింగ్




న్యూఢిల్లీ:ప్రజా స్వేచ్ఛ
ఎయిర్ ఇండియాలో భాగమైన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌ను ఏవియేషన్ రెగ్యులేటర్ అయిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రహస్యంగా హెచ్చరించింది. ఎయిర్‌బస్ ఏ320లో ఇంజిన్ భాగాల మార్పులో వైఫల్యం, తప్పుడు రికార్డులపై మందలించింది. యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ అథారిటీ ఆదేశించిన విధంగా ఎయిర్‌బస్ ఏ320లో ఇంజిన్ భాగాలను వెంటనే మార్చడంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విఫలమైంది. అలాగే ప్రమాణాలకు అనుగుణంగా రికార్డులు ఉన్నట్లు తప్పుగా చూపించడంపై డీజీసీఏ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏడాది మార్చిలో ఈ మేరకు రహస్య మెమోను ప్రభుత్వం జారీ చేసిన విషయం తమకు తెలిసిందని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది.కాగా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ దీనిని ధృవీకరించింది. తమ లోపాలను అంగీకరించింది. డీజీసీఏ నోటీస్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు రాయిటర్స్‌కు తెలిపింది. ఎయిర్‌బస్ ఏ320 ఇంజిన్‌లో విడిభాగాల మార్పును నిర్దేశించిన కాలపరిమితిలోపు చేయకపోవడాన్ని డీజీసీఏ గుర్తించి హెచ్చరించినట్లు ఆ వివరణలో ఒప్పుకున్నది.

# పాకిస్థాన్‌కు టెక్ దిగ్గజం భారీ షాక్..




ఇస్లామాబాద్-ప్రజా స్వేచ్ఛ
టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ షరిఫ్ ప్రభుత్వానికి భారీ షాకిచ్చింది. కనీసం ఎలాంటి అధికారిక ప్రకటన చేయకుండానే ఆ దేశం నుంచి వెళ్లిపోయింది. పాకిస్తాన్‌లో మైక్రోసాఫ్ట్ చీఫ్‌గా ఉన్న జావాద్ రెహ్మాన్ ఈ విషయాన్ని బయటపెట్టారు. దీనిని " ఒక యుగం ముగింపు" అని అభివర్ణించారు. 25 ఏళ్ల క్రితం పాకిస్తాన్‌లో డిజిటల్ వృద్ధిని రూపొందించడానికి మైక్రోసాఫ్ట్ మార్చి 7, 2000లో ఆ దేశంలోకి ప్రవేశించింది. మైక్రోసాఫ్ట్ తన నిష్క్రమణకు ఎలాంటి కారణాలు చెప్పనప్పటికీ, దేశ ఆర్థిక సంవత్సరం 2024 వాణిజ్య లోటు 24.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది, జూన్ 2025లో నిల్వలు కేవలం 11.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి, ఇది టెక్ దిగుమతులు, విదేశీ పెట్టుబడులను ప్రభావితం చేసింది. అంతేకాకుండా ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న పాక్‌కు నైపుణ్య ఉద్యోగుల కొరత రోజురోజుకు పెరిగిపోతుంది. మరోవైపు అనిశ్చిత రాజకీయాలు, ఉగ్రవాదుల ప్రతికూల చర్యలు, ఆర్థిక గందరగోళం, పేలవమైన వాణిజ్య పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆ దేశ పరిశీలకులు చెబుతున్నారు.

# బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను చేతులు కట్టేసి ఢాకా తరలింపు



అహ్మదాబాద్ ప్రజా స్వేచ్ఛ
సుమారు 250 మంది బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను గుజరాత్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పెహల్గామ్ దాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం అక్రమ చొరబాటుదారులను గుర్తించడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. అక్కడ స్థానిక అధికారులతో కలిసి గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్‌తో పాటు పలు నగరాల్లో బంగ్లాదేశ్ జాతీయులు వేల సంఖ్యలో అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో చాలా మంది నకిలీ ఆధార్, పాన్ కార్డులు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ బంగ్లాదేశీయులందరినీ వారి స్వదేశానికి తరలించేందుకు అధికారులు ప్రయత్నించారు. జూలై 3న సుమారు 250 మంది అక్రమ వలసదారుల చేతులను తాళ్లతో కట్టేసి ప్రత్యేక విమానంలో ఢాకా తరలించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల చేతులను తాళ్లతో కట్టి విమానం ఎక్కించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవలే అమెరికాలో సరైన ప్రతాలు లేని కారణంగా భారతీయుల్ని ట్రంప్ ప్రభుత్వం చేతులు, కాళ్లు కట్టేసి ప్రత్యేక విమానంలో తరలించింది. బంగ్లాదేశీయుల ఘటన కూడా ట్రంప్ భారతీయుల్ని పంపిన ఘటననే తలపించింది.

# పాకిస్తాన్‌లోకి చొరబాటు ప్రయత్నం.. 30 మంది ఉగ్రవాదులను హతమార్చిన సైన్యం



ఇస్లామాబాద్ ప్రజా స్వేచ్ఛ
: గడచిన మూడు రోజుల్లో ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులను దాటి పాకిస్తాన్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన 30 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్తాన్ సైన్యం శుక్రవారం వెల్లడించింది. అలాగే గత వారం ఇదే సరిహద్దు ప్రాంతంలో ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు మరణించినట్లు పాక్ సైన్యం ప్రకటనలో పేర్కొంది. హతమార్చిన ఉగ్రవాదులు పాకిస్తాన్ తాలిబన్ లేదా దాని అనుబంధ గ్రూపులకు చెందినవారని, వీరు పాకిస్తాన్‌కి బద్ధ శత్రువైన భారత్ వీరికి మద్దతు ఇస్తోందని పాక్ సైన్యం ప్రకటనలో ఆరోపించింది. అక్రమంగా పాకిస్తాన్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఉగ్రవాదుల్ని భద్రతా దళాలు అసాధారణమైన వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి, అప్రమత్తంగా ఉండి హతమార్చాయని పాక్ ఆర్మీ ప్రకటన పేర్కొంది. మృతి చెందిన ఉగ్రవాదుల దగ్గర నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పాక్ ఆర్మీ ప్రకటించింది. కాగా, ఈ హత్యలు ఉత్తర వజీరిసాన్ సరిహద్దు జిల్లాలో జరిగాయి. గత వారం పాకిస్తాన్ తాలిబన్ వర్గం జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. చొరబాటు ప్రయత్నాన్ని తిప్పికొట్టినందుకు భద్రతా దళాలను పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రశంసించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాము కృతనిశ్చయంతో ఉన్నామని పాక్ ప్రధాని కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

# మణిపూర్‌లో భారీ స్థాయిలో ఆయుధాలు స్వాధీనం



న్యూఢిల్లీ: ప్రజా స్వేచ్ఛ
మణిపూర్ లో భారీ మొత్తంలో ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడానికి రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. 21 INSAS రైఫిల్స్, గ్రెనేడ్లు, IED లు,SLR లు,AK సిరీస్ రైఫిల్స్‌తో సహా పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్, కేంద్ర భద్రతా దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాలు పంచుకున్నాయి. రెండు రోజులుగా కొండ జిల్లాల్లో సోదాలు నిర్వహించి..ఈ భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి.

# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

(మొదటి తరువాయి)

ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించ గలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్ళు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. 'కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళ్తున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆత్మాభిమానం మన ఆయుధం

(మొదటి తరువాయి)

లేని సమయంలో గిరిజనులను ఏకం చేసి బ్రిటిషర్లపై పోరాడిన వీరుడని అన్నారు. సాంస్కృతిక ఆత్మ భారతదేశాన్ని ఐక్యంగా ఉంచుతుంది.. అల్లూరి పేరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కే కాదు దేశం మొత్తం గుర్తింపు ఉంది.. ఆడవుల నుంచి పుట్టిన పోరాటాలు ఇప్పటికీ గుర్తున్నాయి.. దశాబ్దాల పోరాటాలకు ఆయన మార్గదర్శనం చేశారు.. అడవుల్లో ఆయన పోరాటాలు బ్రిటిష్ వారిని వణికించాయి.. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయుధాలు ఎత్తాల్సి వచ్చింది అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఆనాటి బ్రిటిష్ పాలకులు ఇక, గిరిజనులపై, వారి భూమి పై ఆంక్షలు విధించారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గౌరవంగా జీవించుదామని అల్లూరి సీతారామరాజు పిలుపు ఇచ్చారు.. అల్లూరి సీతారామరాజు జీవించిన ప్రాంతాలను కేంద్రం అభివృద్ధి చేస్తుందని అన్నారు. జాతి నిర్మాణంలో గిరిజనుల పాత్ర మరువలేనిది.. ఆదివాసీలను సాధారణ జనజీవనంలోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉంది.. 50, 000లకు పైగా ఆదివాసీ గ్రూపులను ఏర్పాటు- చేశాం.. మొదటి సారి గిరిజన మహిళను రాష్ట్రపతి చేశాం.. అల్లూరి సీతారామరాజు సంకల్పాన్ని ప్రతి గ్రామం, ఇంటికి తీసుకుని వెళ్దామని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చి దిద్దుతున్నామని అని రాజ్‌నాథ్ అన్నారు. బాలికల చదువు కోసం పాఠశాల ల అభివృద్ధి జరుగుతుంది.. 108 సూర్య నమస్కారాలు కేవలం దేహం దారుఢ్యం కోసం కాదు.. మానసిక అభ్యున్నతికి ఉపయోగపడతాయి.. క్రమంగా అడవులు నక్సల్స్ కు అడ్డంగా మారాయి.. ఇప్పుడు నక్సల్స్ పూర్తిగా తుడిచిపెట్టుకు పోతున్నాయి.. ఆగస్టు 2026లోపే నక్సల్స్ ను తుడిచి పెట్టేస్తాం.. నక్సల్స్ చేతిలో బంధీగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి వేగంగా జరుగుతోంది.. వేగంగా గ్రోత్ కారిడార్ లుగా అభివృద్ధి చెందుతున్నాయి.. కనీసం నెట్వర్క్ లేకపోయేది.. టీ-వీలు, ల్యాప్ టాప్ లు, మొబైల్ టవల్ లు కూడా లేకుండాపోయాయి.. 8 వేల టవర్లను ప్రారంభించేం దుకు సిద్ధం గా ఉన్నాయని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పహెల్గామ్ లో దాడి తరువాత ఆపరేషన్ సింధూర్ తో ధైర్యం, ధర్మం, ఖర్మను పరిచయం చేశామని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. రామాయణంలో హనుమంతుడు చేసిన పనే ఇప్పుడు మనం చేశాం.. మనల్ని ఎవరు చంపారో వారిని మాత్రమే చంపాం.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే తగిన సమాధానం చెబుతాం.. న్యాయం అందిరికీ సమానంగా దక్కాలి.. హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు- ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు షెకావత్, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపులు కడితే సహించబోము

(మొదటి తరువాయి)

టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమైంది. తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై సీరియస్ అయ్యారు. నలుగు రైదుగురు గ్రూపులు కడితే భయపడతారు అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే నేతలను రాహుల్ గాంధీ.. నేను పట్టించుకోమని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం



లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవంతంగా ఎదుర్కొవాలని దిశానిర్దేశర చేశారు. ఇన్‌చార్జ్ మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశర చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీ-పీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు.

## మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం

(మొదటి తరువాయి)

ప్రధాని మోడీ ఈ చిన్నదేశంలో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. ఈ దేశ అత్యున్నత విశిష్ట పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు తాను ట్రినిడాడ్ టొబాగో ప్రజలకు కృతజ్ఞుడిగా ఉంటానని ప్రధాని తెలిపారు. తాను ఈ పురస్కారాన్ని 140 కోట్ల మంది భారతీయుల పక్షాన స్వీకరిస్తున్నానని తెలిపారు. రెండు మూడు రోజుల క్రితమే మోడీకి ఘనా దేశ విశిష్ట పురస్కారం అందింది. ఈ విధంగా ప్రధాని మోడీకి ఇప్పటివరకూ మొత్తం మీద 25 అంతర్జాతీయ స్థాయి గౌరవ పురస్కారాలు దక్కాయి. 180 సంవత్సరాల క్రితం బీహార్ ఇతర ప్రాంతాల నుంచి భారతీయులు ఈ దేశానికి వచ్చి స్థిరపడ్డారని, తరతరాలుగా ఈ దేశంతో మనకు అత్యంత పురాతన వారసత్వ బంధం ఉందని, ఇది మరింత పెనవేసుకుపోతోందని పురస్కార స్వీకరణ సభలో మోడీ తెలిపారు.

## నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

(మొదటి తరువాయి)

ఉన్నట్లు- ప్రాథమిక పరీక్షల్లో వెల్లడైంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పేర్కొన్నారు. మరోవైపు, కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. సోమాజీగూడ యశోద ఆస్పత్రి వైద్యులు, అధికారులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు అత్యుత్తమ చికిత్స అందించాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని.. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

## బిజెపి జాతీయ అధ్యక్షురాలుగా మహిళా నేత?

(మొదటి తరువాయి)

ఆ పార్టీ అధిష్టానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి.. పి.వి.ఎన్‌కు కట్టబెట్టారు. దీంతో జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించే బరిలో పురంధర్వేశరి కూడా నిలిచారు. ఇటీవలి కాలంలో పురంధరేశ్వరి ఆపరేషన్ సిందూర్‌పై లండన్, ఫ్రాన్స్, జర్మనీ, యూరోపియన్ యూనియన్, ఇటలీ, డెన్మార్క్ దేశాలకు నేతృత్వం వహించారు. కాగా, తమిళనాడుకు చెందిన వనతి శ్రీనివాసన్ బిజెపిలో కీలక బాధ్యతలో ఉన్నారు. ఈమె బిజెపి మహిళా మోర్చా జాతీయ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఈమె 2021లో అసెంబ్లీ ఎన్నికల్లో కోయంబత్తూరులో ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) వ్యవస్థాపకుడు కమల్‌హాసన్‌ని ఓడించారు. 1993 నుంచి ఈమె బిజెపి పార్టీలో కొనసాగుతున్నారు. బిజెపి దక్షిణాదిలో బలం పెంచుకునే దిశగానే తమిళనాడుకు చెందిన నిర్మలా సీతారామన్, వనతి శ్రీనివాసన్‌లు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పురంధరేశ్వరిని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్‌లో మాజీ సీఎం రోశయ్య విగ్రహం

(మొదటి తరువాయి)

కార్యక్రమంలోసీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యకర్తలు కూడా భారీగా తరలివచ్చారు.

## తెలంగాణ ప్రయోజనాలపై రాజీపడం

(మొదటి తరువాయి)

నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డి పోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు నిలదీశారు. నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్ఎస్ పార్టీ సహించదు. పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు, పేగులు తెగేదాకా కొట్లాడుతం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటం. కంటికి రెప్పలా ఉండి కాపాడుకుంటం. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే.. పొలిమేర దాకా తరిమికొడతాం.. ప్రాంతంవాడే ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం అని హరీశ్‌రావు హెచ్చరించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. అని హరీశ్‌రావు నినదించారు.

## ప్రపంచ దేశాలకు కొత్త సుంకాల పై ట్రంప్ లేఖలు

(మొదటి తరువాయి)

భాగస్వాములకు ఈ లేఖలను పంపుతామని ఆయన ప్రకటించారు. అమెరికాతో వాణిజ్యం చేయాలంటే సుంకాలు ఎంత చెల్లించాలన్న దానిపై ఆయా దేశాలకు లేఖలు పంపనున్నాం. శుక్రవారం నుంచి నుంచి రోజుకు 10 దేశాల చొప్పున వీటిని పంపిస్తాం" అని ఆయన విలేకరులకు చెప్పారు. టారిఫ్‌లపై ఉన్న డెడ్‌లైన్‌ను పొడిగించవచ్చు లేదా కుదించవచ్చు అని కూడా చెప్పుకొచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2న ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్, చైనా సహా పలు దేశాలపై భారీగా సుంకాలు విధించారు. అనంతరం ఆయా దేశాలతో ఎగుమతులు, దిగుమతుల టారిఫ్‌లపై నిర్ణయం తీసుకోవడం, వాణిజ్య ఒప్పందం చేసుకోవడం కోసం 90 రోజుల పాటు గడువు (జులై 9వ తేదీ వరకు) విధిస్తూ సుంకాల అమలును తాత్కాలికంగా నిలిపివేశారు. కొనసాగుతున్న చర్చలు డెడ్‌లైన్‌లోగా అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకోకపోతే.. ఆయా దేశాలపై తమ ఇష్టానుసారం సుంకాలను విధిస్తామని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ క్రమంలోనే భారత్, చైనా, బ్రిటన్ వంటి దేశాలు అగ్రరాజ్యంతో వాణిజ్య చర్చలు జరిపాయి. ఇప్పటికే కొన్ని కొలిక్కిరాగా.. భారత్‌తో చర్చలు కొనసాగుతున్నాయి. రెండు రోజుల్లోగా ఇరుదేశాల మధ్య మినీ ట్రేడ్ డీల్ కుదిరే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. అటు చైనాతో ఒప్పందం కుదిరినట్టు ఇటీవల ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# సంపాదకీయం

## కలవరపెడుతున్న ఉద్యోగరంగం !

ఐటి రంగం ఎంతగా ఊరిస్తుందో..అంతగా క్షోభ పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఐటి ఉద్యోగులకు ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇటీవలల కాలంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారు. స్కిల్ లేకపోవడం కన్నా..ఖర్చులు తగ్గించుకునే ఉద్దేశ్యంతో తొలగిస్తున్నారు. పేరు ప్రతిష్టలు ఉన్న కంపెనీలే ఇలా చేస్తున్నాయి. జీతం ఎక్కువగా ఉన్న ఉద్యోగులనే టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగం ఊడిపోవడంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజంగానే ఖర్చు తగ్గించుకునే పద్దతిలో వారిని పిలిచి జీతంలో కోతలు విధించి, వారిని కొనసాగించవచ్చు. కానీ ఆలా జరగడం లేదు. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్న తీరు తీవ్రంగా కలవరపెడుతోంది. ఉద్యోగం పోయినా బతకవచ్చున్న ధీమా లేకుండా పోతోంది. దానికి ఏదైనా రంగంలో రాణించే బహుముఖ ప్రావీణ్యం ఉండడం లేదు. పనిచేసుకునే పరిస్థితులు కూడా లేకపోవడం చూస్తున్నాం. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా, ఉపాధి రంగంలో అయినా రాణిస్తారు. విద్యావిధానంలో మార్పుల తోనే ఇది సాధ్యం. కేవలం బట్టీ చదువుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు లోపిస్తున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా మార్కెట్ విస్తరించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా ఓ క్రమద్దతిలో అభివృద్ది చేసుకుంటూ పోవాలి. ఎంతసేపు పెన్షన్లు పంచడం, కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్లు కట్టించడం ఇదే అభివృద్ది కాదు. ప్రజలు తమకాళ్లమీద తాము నిలబడగలిగేలా వాతావరణం సృష్టించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాల విధానాలు ఉండాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో క్వాంటమ్ గురించి సిఎం చంద్రబాబు మాట్లాడుతున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ స్కిల్ వర్సిటీ అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ దావోస్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఉన్న వనరులతో ఏం చేయవచ్చున్నది ముందుగా తేల్చుకోవాలి. సహజవనరులు ఉన్నాయి. సముద్రతీరం ఉంది. ఇవన్నీ కూడా ఉపాధికి పెద్ద అభివృద్ధి కేంద్రాలు. ఇరు రాష్ట్రాల సిఎంలు పారిశ్రామక వేత్తలకు రెడ్ కార్పెట్ పరిచారు. ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి రావాలి. పన్నులు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు కాకుండా, ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారుతున్నారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. గంగవరం పోర్టు, పోలవరం ప్రాజెక్ట్, ఫార్మాసిటీల లాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి ఘోరాలు జరక్కుండా దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పోయారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను కూడా గుర్తించని కంపెనీలు వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. సిగాచీ పరిశ్రమలో జరిగిన దారుణమే ఇందుకు నిదర్శనం. పరిశ్రమలను ప్రోత్సహించి, ఆరోగ్యకర వాతావరణంలో ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రోత్సహిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఆయా కంపెనీల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని ప్రభుత్వాలు చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. అలాగు భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. ఉద్యోగ,ఉపాధి రంగాలకు పెద్దపీట వేసినప్పుడే స్వయం సమృద్ధి సాధ్యం కాగలదు.

## ఆపరేషన్ సింధూర్ వేళ..
# ఆయుధాలు పరీక్షించిన చైనా

### –ఆర్మీ డిప్యూటీ చీఫ్ రాహుల్ సింగ్



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను పేల్చేందుకు భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో అనేక అవరోధాలు ఎదురయ్యాయి. ఆ ఆపరేషన్ ఎన్నో పాఠాలు నేర్పినట్లు డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ తెలిపారు. ఎఫ్ఐసీసీఐ నిర్వహించిన న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆధునిక యుద్ధ శైలి గురించి ఆపరేషన్ సిందూర్ బయటపెట్టిందన్నారు. సైనిక చర్యల వేళ .. వాయు రక్షణ వ్యవస్థ, సాంకేతిక ఆధునీకరణ.. కీలకమైన అంశాలని ఆయన తెలిపారు.పాకిస్థాన్–చైనా మధ్య కూటమి ప్రమాదకరంగా మారినట్లు ఆర్మీ డిప్యూటీ చీఫ్ వెల్లడించారు. పాకిస్థాన్‌తో బోర్డర్ విషయంలో రెండు సమస్యలు ఉన్నట్లు ఆయన చెప్పారు. పాకిస్థాన్ ముందు ఉండగా, దాని వెనుక చైనా ఆ దేశానికి సపోర్టు ఇస్తున్నట్లు చెప్పారు. పాకిస్థాన్ వద్ద ఉన్న మిలిటరీ దళంలో .. సుమారు 81 శాతం చైనా హార్డ్‌వేర్ ఆయుధాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.
ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎయిర్ డిఫెన్స్ కీలకంగా మారిందని, ఆ ఆపరేషన్ కొన్ని పాఠాలు నేర్పిందన్నారు. భారతీయ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను చాలా బలోపేతం చేయాల్సి ఉందన్నారు. చైనా సహాయంతో పాకిస్థాన్ మన గురించి లైవ్ అప్‌డేట్స్ తెలుసుకున్నదని, మన ఆయుధాల అంశాన్ని పాకిస్థాన్‌కు ఎప్పటికప్పుడు చేరవేసిందన్నారు. ఇతర ఆయుధాలతో పోటీపడేందుకు చైనా తన ఆయుధాలను టెస్ట్ చేసిందని, ఇదొకరకంగా లైవ్ ల్యాబ్‌లా మారిందని, టర్కీ కూడా పాకిస్థాన్‌కు కీలకమైన సపోర్టు ఇచ్చిందని, బైరక్తార్‌తో పాటు ఎన్నో రకాల డ్రోన్లను అందజేసిందన్నారు. డీజీఎం స్థాయి చర్చలు జరుగుతున్నప్పుడు మన ఆయుధాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పాకిస్థాన్‌కు చైనా చేరవేసిందన్నారు. ఈ దశలో మనకు బలమైన వాయు రక్షణ వ్యవస్థ కావాలని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ తెలిపారు. కానీ ఆపరేషన్ సింధూర్ వేళ భారతీయ సైనిక బలగాలు చాలా కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలపై దాడులు చేశాయన్నారు. మానవ మేధస్సు, టెక్నాలజీ మధ్య వ్యూహాత్మక సహకారం ఉండాలన్నారు. ఆపరేషన్ సింధూర్ కోసం 21 టార్గెట్లను గుర్తించామని, దీంట్లో 9 టార్గెట్లను ఎంచుకున్నామని, ఆపరేషన్ జరిపే చివరి రోజు మాత్రమే ఆ 9 టార్గెట్లను ధ్రువీకరించామని పేర్కొన్నారు. త్రివిధ దళాలు ఐక్యంగా ఆపరేషన్‌లో పాల్గొన్నాయని తెలిపారు. సైనిక లక్ష్యం చేరుకున్న తర్వాత.. దాన్ని ఆపాల్సి ఉంటుందని, యుద్ధం ప్రారంభించడం చాలా సులువు అని, కానీ దాన్ని నియంత్రించడం కష్టమైందన్నారు. సరైన సమయంలో యుద్ధాన్ని ఆపి మాస్టర్ స్ట్రోక్ ఇచ్చామని పేర్కొన్నారు.


## 20 రోజుల తర్వాత టెహ్రాన్ ఎయిర్‌పోర్టుకు తొలి విదేశీ విమానం..!




**టెహ్రాన్ ప్రజా స్వేచ్ఛ**
ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పర దాడులతో రణరంగంలా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు క్రమంగా చక్కబడుతున్నాయి. తమపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ వైమానిక సేవలను నిలిపివేసిన ఇరాన్.. తాజాగా వాటిని పునరుద్ధరించింది. 20 రోజుల నిషేధం తర్వాత టెహ్రాన్ లోని ఇమామ్ ఖొమేని అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలిసారిగా విదేశీ విమానం దిగింది.ఈ విషయాన్ని ఇరాన్ మీడియా వెల్లడించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి 'ఫ్లైయింగ్ దుబాయ్' సంస్థకు చెందిన విమానం భారీ భద్రత నడుమ ల్యాండ్ అయినట్లు ఇరాన్ పౌర విమానయాన శాఖ తెలిపింది. ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల అనంతరం తాజా పరిణామం.. ఇరాన్ వైమానిక రంగం స్థిరత్వం సాధించే దిశగా అడుగులు వేసేందుకు దోహదపడుతుందని పౌర విమానయాన శాఖ అధికార ప్రతినిధి మెహ్దీ రమేజానీ వెల్లడించారు. అంతర్జాతీయ విమానాలు ఇరాన్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా అవసరమైన చర్యలు చేపడతామని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని క్రమంగా సర్వీసుల సంఖ్యను పెంచుతామని రమేజానీ తెలిపారు. కాగా ఇరాన్‌లోని అణు స్థావరాలే లక్ష్యంగా ఇటీవల ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఇరాన్ కూడా అదేస్థాయిలో విరుచుకుపడింది. ఈ క్రమంలోనే ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. 12 రోజుల ఉద్రిక్తతల తర్వాత అమెరికా మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలోనే క్రమంగా వైమానిక సేవలు ప్రారంభమవుతున్నాయి.


## బైడెన్ ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలిచ్చాడు

**న్యూఢిల్లీ:ప్రజా స్వేచ్ఛ**



రష్యా–ఉక్రెయిన్ దేశాల మధ్య 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలు అందిస్తూనే ఉంది. అయితే ఇటీవల తమ ఆయుధ నిల్వలను సమీక్షించిన అమెరికా.. ఉక్రెయిన్‌కు కొన్నిరకాల ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని పెంటగాన్ అధికారులు వెల్లడించారు.ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. జో బైడెన్ హయాంలో దేశం గురించి ఆలోచించకుండా ఉక్రెయిన్‌కు విపరీతంగా ఆయుధాలు అందజేశారని, దేశాన్ని ఖాళీ చేశారని ఆరోపించారు. దేశ భద్రతకు సరిపడా ఆయుధాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని.. అందుకే కీవ్‌కు అందజేయాల్సిన ఆయుధ సామాగ్రిపై కోత విధించినట్లు ఆయన పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదట్లో ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం అంగీకరించిందని, అయితే ఇటీవల ఆయుధ నిల్వలను సమీక్షించిన రక్షణశాఖ.. కీవ్‌కు ఇస్తామని హామీ ఇచ్చిన ఆయుధాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించిందని ట్రంప్ తెలిపారు. ఆయుధ కొరత కారణంగా ఉక్రెయిన్‌కు పంపాల్సిన పెండింగ్ షిప్‌మెంట్లను పంపించొద్దని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. కాగా బైడెన్ హయాంలో అమెరికా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధ, సైనిక సహాయాన్ని అందించింది. ఆయన పదవి నుంచి వైదొలగడానికి ముందు కూడా ఉక్రెయిన్‌కు పెద్ద మొత్తంలో ఆర్థిక, ఆయుధ సాయం చేస్తామని ప్రకటించారు.

## బ్రిటన్ ఫైటర్ జెట్ తరలింపునకు మాస్టర్ ప్లాన్..



**తిరువనంతపురం ప్రజా స్వేచ్ఛ**
సాంకేతిక లోపంతో జూన్ 14న కేరళ తిరువనంతపురంలో ఎయిర్ పోర్టులో బ్రిటన్ కు చెందిన ఫైటర్ జెటర్ అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. అయితే నిపుణులతో పలు పలుమార్లు ఆ ఫైటర్ జెట్ కు మరమ్మతులు చేసినా ఎటువంటి ప్రయోజనం కలుగలేదు. దీంతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. F-35B స్టెల్త్ ఫైటర్ జెట్ ను విడిభాగాలుగా చేసి బ్రిటన్ దేశానికి తరలించాలని అధికారులు నిర్ణయించారు. రక్షణ రంగ నిపుణుల ప్రకారం.. ఈ జెట్‌ను C–17 గ్లోబ్‌మాస్టర్ III కార్గో విమానంలో తరలించే అవకాశం ఉంది. ఈ విమానంలోని వెడల్పు పరిమితి కారణంగా F–35 రెక్కలను విడదీయాల్సి ఉంటుంది. రెక్కలను సురక్షితంగా వేరు చేసి, జెట్‌ను కాంపాక్ట్ యూనిట్‌గా మార్చడం వల్ల మాత్రమే దానిని లోడ్ చేయడం సాధ్యమవుతుంది. దీని కోసం అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు ప్రత్యేకంగా పని చేస్తున్నారు. C–17 గ్లోబ్‌మాస్టర్ III కార్గో విమానం దాదాపు రెండు F-35B ఫైటర్ జెట్ లను తీసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంటుంది.

## 'జై గుజరాత్' అంటూ.. ప్రసంగం ముగించిన ఏక్‌నాథ్ షిండే



**ముంబై ప్రజా స్వేచ్ఛ**
మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే మరోసారి సంచలనం రేపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రసంగం చివర్లో 'జై గుజరాత్' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. శుక్రవారం పూణేలోని కోంధ్వాలో జైరాజ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఈ సందర్భంగా మాట్లాడారు. అయితే ప్రసంగాన్ని ముగించే ముందు అమిత్ షా గౌరవార్థం షేర్–షాయారీ వినిపించవచ్చా అని సభికులను అడిగారు. అక్కడున్న వారు సానుకూలంగా స్పందించారు.కాగా, ప్రసంగం ముగించిన తర్వాత ఏక్‌నాథ్ షిండే సభికులకు కృతజ్ఞతలు తెలిపారు. చివరన 'జై హింద్, జై మహారాష్ట్ర' అని అన్నారు. కొద్దిసేపు ఆగిన తర్వాత 'జై గుజరాత్' అని నినాదించారు. దీంతో ఆ కార్యక్రమానికి హాజరైన వారు ఆశ్చర్యపోయారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మెప్పు కోసం 'జై గుజరాత్' అని ఏక్‌నాథ్ షిండే అనడం చర్చకు దారి తీసింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# దేశంలో 11 ఏండ్లుగా ఎమర్జెన్సీ





## -దీనిపై బీజేపీ నేతలు మాట్లాడరెందుకు? : టీపీసీసీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ...**
దేశంలో 11 ఏండ్లుగా ఎమర్జెన్సీ పరిస్థితులున్నాయనీ, దీనిపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏండ్ల క్రితం జరిగిన ఎమర్జెన్సీపై బీజేపీ మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. మ్యానిఫెస్టో అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. హామీలను అమలు చేసే ఏకైక పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణలో పరిపాలన, పార్టీ కార్యకర్తల పనితీరు బాగుందని కితాబిచ్చారు. పార్టీ పదవుల్లో ఉన్నవారు ఆ హౌదాలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సమర్థులకే పదవులు ఇవ్వాలని మహేశ్ కుమార్ గౌడ్‌కు సూచించారు. పార్టీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడొద్దనీ, పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఒకే తాటిపై నిలవాలని దిశానిర్దేశం చేశారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. అగ్రకులాలకు సీఎం, బీసీకి పీసీసీ అధ్యక్షునిగా, క్యాబినెట్‌లో నలుగురు దళితులు, స్పీకర్‌గా మరో దళితునికి అవకాశమిచ్చిందని ఉదహరించారు. రాష్ట్రంలో మరోసారి 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి కులగణన చేయడంలో విజయం సాధించినట్టు తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో చాలా విజయాలు సాధించినట్టు చెప్పారు. తాను పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో 45 లక్షల మంది క్రియాశీలక సభ్యత్వం చేసుకున్నామని తెలిపారు. పార్టీ పదవులను తేలిగ్గా తీసుకోవద్దనీ, అవి రాజకీయాల్లో ఎదుగుదలకు ఉపయోగ పడతాయని అన్నారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కాబోతున్నాయనీ, నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి**

# జగిత్యాల జిల్లా వాసి దీప్తిరెడ్డికి ఓయు పిహెచ్‌డి ప్రధానం



**జగిత్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ...**
జగిత్యాల జిల్లా తక్కల్లపల్లి గ్రామానికి చెందిన ముదిగంటి దీప్తి రెడ్డికి గ్రంథాలయ శాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం లో పిహెచ్‌డి ప్రధానం చేయబడిందని తెలిపారు. వీరు ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఇష్యూస్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలపై ప్రొఫెసర్ జె. వివేకవర్ధన్ ,లైబ్రేరియన్ ఆచార్య జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పిహెచ్‌డి పూర్తి చేశారని తెలిపారు.దీప్తి రెడ్డి ప్రస్తుతము మహాత్మ జ్యోతిబాయ్ పూలే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఉమెన్స్ పెద్దపల్లి జిల్లాలో లైబ్రేరియన్ గా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అంజలి కుమారి ఆర్ సి ఓ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జ్యోతిబాయ్ పూలే ప్రభుత్వ గురుకుల ఎడ్యుకేషనల్ సొసైటీ, మణిదీప్తి డి సి ఓ పెద్దపల్లి జిల్లా, వనజ ప్రిన్సిపాల్ జ్యోతిబాయ్ పూలే ప్రభుత్వ డిగ్రీ ఉమెన్స్ కళాశాల పెద్దపెల్లి పలువురు దీప్తి రెడ్డిని అభినందించారు.

# మండల కేంద్రంలో ఘనంగా జువ్వాడి నర్సింగ రావు జన్మదిన వేడుకలు





**జగిత్యాల, ప్రజా స్వేచ్ఛ**
కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, జనహృదయ నేత జువ్వాడి నర్సింగ రావు జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నం మండలంలో ఘనంగా జరిగాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.వేడుకలలో భాగంగా, బండి రాజేష్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన దాతృత్వం, సేవాగుణం. ఎందరికో. ఆదర్శమని.నిర్వాహకులు ప్రశంసించారు.మీ నిస్వార్థ సేవకు సెల్యూట్" అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదినాన్ని వేడుకగా జరిపారు.ఈ కార్యక్రమాల్లో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూదిగం గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్ తిపిరి అశోక్ కుమార్, యువ నాయకుడు ముక్కెర వేణుగోపాల్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ బోరిగాం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మేడికొండ రమేష్, బండి రాజేష్, డైరెక్టర్ భూస రాజేశ్వర్, నల్ల రమేష్, కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, జంగ విజయ్, సుగుణకర్ రావు, నల్ల రామరాజు, చల్ల పురుషోత్తం, బంటు నారాయణ, వాల్గాట్ నరేష్, కనక జగన్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా స్వామి వివేకానంద వర్ధంతి



**హైదరాబాద్ ,ప్రజా స్వేచ్ఛ...**
హైదరాబాద్ లోని ఎన్‌టిఆర్ భవన్‌లో స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ తెలంగాణ నిర్వహించింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి నాయకులు పుష్పాలను అర్పించి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయపార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ... ప్రజలే తన కుటుంబంగా భావించి నాయకులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని చెప్పారని అన్నారు. అలాగే నాయకులు చిన్న పిల్లవానివలె ఉండాలని కూడా చెప్పారని అన్నారు. స్వామి వివేకానంద విదేశాలలో పర్యటించిన తరువాత భారత దేశానికి వచ్చి భారత దేశంలో అభివృద్ధి చెందకపోవడానికి 5 కారణాలను స్వామి వివేకానంద చెప్పారు. అవి: కులం, అంటరానితనం, స్త్రీ అణచివేత, విద్యా విధానంలో లోపాలు, అణగారిన వర్గాలను అక్కున చేర్చుకునే విధానం లేకపోవడం. ఈ 5 అడ్డంకులు భారతదేశం అభివృద్ధి చెందకపోవడానికి కారణంగా స్వామి వివేకానంద గుర్తించారు. స్వామి వివేకానంద గుర్తించిన ఈ 5 సమస్యలను నిర్మూలించి ప్రజలను సంక్షేమం, అభివృద్ధివైపు నడిపించడానికి తెలుగుదేశం పార్టీ, ఎన్‌టిఆర్, చంద్రబాబు గారు కృషి చేశారని అన్నారు.ఎస్సీ, ఎస్టీ వంటి అణగారిన వర్గాల విద్యకొరకు దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎన్‌టిఆర్ 46 ఆశ్రమ పాఠశాలలను ప్రారంభించారని వీటిని చంద్రబాబు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని నియోజకవర్గాలకు విస్తరింపజేశారని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటగా చదువుల పండగ అనే చట్టాన్ని తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు గారికి దక్కుతుందని అన్నారు. అలాగే వివిధ కారణాలచేత చదువును మధ్యలో మానివేసిన వారికి కోసం బ్యాక్ టు స్కూల్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని అన్నారు. అంటరానితనం నిర్మూలన కార్యక్రమాన్ని చంద్రబాబు గారు మెదక్ జిల్లా, పెద్దరెడ్డిపేట, తుల్జాభవాని దేవాలయంలో ప్రారంభించారని అన్నారు. ఎన్‌టిఆర్ మహిళలకు ఆస్తిలో హక్కును కల్పించి స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లను కల్పించారు. ఈ రిజర్వేషన్‌లను చంద్రబాబు గారు పెంచడమే కాకుండా 5 లక్షల మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా కృషి చేశారు. రైతులకు ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి వాటిని మహిళా సంఘాల ద్వారా పంపిణీ చేయించారు. మహిళా సాధికారతకు కృషి చేశారు. ఎన్‌టి రామారావు పాలనను తాలూకా వ్యవస్థను నుంచి మండల స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. చంద్రబాబు గారు ప్రజల ఇంటి వద్దకే పాలన తీసుకొచ్చి జన్మభూమి కార్యక్రమం ద్వారా గ్రామ సభలను పెట్టి తమ అవసరాలను ప్రజలే చర్చించుకుని నిర్ణయం తీసుకునే వ్యవస్థను తీసుకొచ్చారు. సచివాలయంలో ఉండే ఐఏఎస్, ఐపీఎస్‌లు గ్రామాలలోకి వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునే పరిస్థితులను తీసుకొచ్చారు.సహజ వనరులు అందరికీ చెందుతాయి. ఉన్నవారు పొరుగువారికి సహాయం చేయాలని స్వామి వివేకానంద చెప్పేవారు. ఈ ఉద్దేశాన్ని అమలు చేయడానికి చంద్రబాబు గారు పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. భూదానోద్యమ స్ఫూర్తిని కొనసాగించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 11.09.1996లో భూదానోద్యమ ఉద్యమాన్ని ప్రారంభించిన వినోభాబావే, ఈ ఉద్యమానికి మొట్టమొదట భూ దానాన్ని ఇచ్చిన వెదిరె రాంచందర్ రెడ్డి గార్ల కాంస్య విగ్రహాలను చంద్రబాబు గారు పెట్టించడం జరిగింది. కానీ ఈ భూదానోద్యమం ద్వారా సేకరించిన సుమారు 40 వేల ఎకరాల భూమి కబ్జాలకు గురైందని దినపత్రికలలో వార్తలను చూస్తూ ఉన్నాం.తెలంగాణలోని తెలుగుదేశం పార్టీ నాయకులు పి-4 స్ఫూర్తితో పేదలకు సహాయం చేసే కార్యక్రమాలను చేపట్టాలని కోరుచున్నాం. భారతదేశం అభివృద్ధి చెందకపోవడానికి స్వామి వివేకానంద చెప్పిన 5 అడ్డంకులను తొలగించడానికి ఎన్‌టిఆర్, తెలుగుదేశం పార్టీ కృషి చేసిందని అన్నారు. జాతీయ అధ్యక్షులు చంద్రబాబు గారి నేతృత్వంలో ఈ అడ్డంకులను పూర్తిగా తొలగించడానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజునాయక్, శ్రీనివాసా నాయుడు, నెల్లూరు దుర్గాప్రసాద్, పోలంపల్లి అశోక్, జనగాం నర్సింగరావు, కట్టా రాములు, గూడెపు రాఘవులు, ఎబిఆర్ మోహన్‌రావు, తమోదన్‌రావు, జగదీష్, సాయి నాగార్జున, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి

**ఆర్డీఓ కృష్ణ రెడ్డి**






**భువనగిరి,ప్రజా స్వేచ్ఛ...**
ఓటరు జాబితా సవరణలో బీఎల్ ఓలు, జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో కృష్ణారెడ్డి అన్నారు. ఓటరు జాబితా సవరణపై,భువనగిరిలో బీఎల్ ఓ లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరమే నూతన ఓటరు నమోదు సవరణ,తొలగింపు బదిలీ, ఫొటో మార్పిడి తదితర సవరణలను చేపట్టాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున బల్కుగా వచ్చే ఫారాలు,ఒకే వ్యక్తి పెద్ద మొత్తంలో ఇచ్చే ఫారాలపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.నిస్పక్షపాతంగా బాధ్యతాయుతంగా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అన్నారు.ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని,అర్హులందరూ ఓటరు జాబితాలో చేరేలా చైతన్యపరచాలని అన్నారు. తహసీల్దార్ అంజిరెడ్డి,రిసోర్స్ పర్సన్స్ నర్సిరెడ్డి,నరేందర్రెడ్డి చిత్తరంజన్, బిక్షం, సంజీవరెడ్డి ప్రణయ్ కుమార్,రజనీష్ ప్రసాద్,మరియు బాలరామ్ అవగాహన కల్పించారు.

# దొడ్డి కొమురయ్య అడుగుజాడల్లో నడవాలి.

**మహేశ్వరం మండల కురుమ సంఘం అధ్యక్షుడు పిఎసిఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య.**



**మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ...**
దొడ్డి కొమురయ్య అడుగుజాడలో ప్రతి ఒక్కరు నడవాలని మహేశ్వరం కురుమ సంఘం అధ్యక్షుడు పిఎసిఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని ఆయన చెప్పారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన గొప్ప పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య తెలంగాణ ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంగోత్ రాజు నాయక్, సీనియర్ నాయకులు కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, కర్నాటి మనోహర్ నేత, ఆనందం, నవీన్, నిమ్మగూడెం సుధీర్ గౌడ్, పర్వతాలు, వీరి బాబు, ఆశన్న గారి బాలయ్య, శీను, పోల్కం కిష్టయ్య, రవి, మహేందర్, దుద్దు కృష్ణ, యాదగిరి, శ్రీశైలం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి...

**-ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**

**-బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి**



**మాద్గులపల్లి/ ప్రజా స్వేచ్ఛ..**
మాడుగుల పల్లి మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జూలై 9వ తారీఖు నాడు దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు కర్షకులు ప్రజలు ఏకమై సమ్మెను విజయవంతం చేయాలని కోరినారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిన కార్మిక చట్టాలను కాలరాస్తూ, బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చిన పరిస్థితి , గతంలో రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతుల ఉసురు పోసుకోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశ రైతాంగం మొత్తం పోరాటం చేయగా ఆ నాలుగు చట్టాలను అమలు చేయకుండా వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితి అలాగే రైతులకు మద్దతు ధర చట్టాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటికి నెరవేర్చని పరిస్థితి, ఉపాధి హామీ చట్టాన్ని తుంగలో దిక్కే ప్రయత్నం చేస్తున్నటువంటి పరిస్థితి ఉన్నది. నిరుద్యోగులని గాలికి వదిలేసిన పరిస్థితి కాబట్టి ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని పలుమార్లు విన్నపాలు చేసినప్పటికీ కూడా ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా నిరంకుశత్వ అవలంబిస్తుందని. దానికి వ్యతిరేకంగానే జులై 9 వ తారీఖు నాడు కార్మిక కర్షక ఐక్యత తోటి దేశవ్యాప్త సమ్మె నిర్వహించడం జరుగుతున్నది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్ రెడ్డి, నాగయ్య, తంగేళ్ల నాగమణి, వెంకటాచారి, బొంగర్ల వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

## సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించాలి

**రైతు సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్**



**మిర్యాలగూడ ప్రజా స్వేచ్ఛ:-**
నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమరయ్య 79 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అయన ఆశయాలను సాధించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం విరోచతమైన పోరాటం చేశారని గుర్తు చేశారు. పేదవాడికి ఉపాధి కోసం భూమి ఇవ్వాలని, దున్నేవాడికి భూమి ఇవ్వాలని అనేక పోరాటాలు చేశారని చెప్పారు. ఆయన చూపిన ఉద్యమం మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వస్కుల మట్టయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా నాయకులు రేమిడాల పరుశురాములు, బావాండ్ల పాండు, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి, రైతు సంఘం జిల్లా నాయకులు చౌగాని వెంకన్న, రామకృష్ణ రవి నాయక్, వాడపల్లి రమేష్, గుణగంటి రామచంద్ర, చారి, భాషా తదితరులు పాల్గొన్నారు.

## మాల సంఘాల గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా బేర బాలన్న ఏకగ్రీవంగా ఎన్నిక.




**మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ...**
మాల సంఘాల జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా బేర బాలకిషన్, బాలన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మందాల భాస్కర్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా బేర బాలకిషన్ బాలన్న ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బేర బాలన్న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వల్ల మాల ఉద్యోగులకు, విద్యార్థులకు జరిగే నష్టాన్ని విస్తృతంగా చర్చిస్తామని అన్నారు. రాబోయే రోజులలో మాలలకు జరిగే అన్యాయాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతామని ఆయన పేర్కొన్నారు. మాలలకు అన్యాయం జరగకుండా గ్రేటర్ హైదరాబాద్ లోని ప్రతిబస్తీలో మాల సంఘాలను సమీకరించి రాష్ట్ర గనుల శాఖ మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామిని ఘనంగా సన్మానిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కో-ఆర్డినేటర్ గా తాళ్లపల్లి రవి, గౌరవాధ్యక్షునిగా చెరుకు రామచందర్, కన్వీనర్ గా నల్లాల కనకరాజు, వర్కింగ్ చైర్మన్ గా మంత్రి నరసింహయ్య, సిద్దిపేట భీమసేన, ముఖ్య సలహాదారులు గా న్యాయవాది కొరివి వేణుగోపాల్, రావుల అంజయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సావిన్ సౌదాలు ఎన్నికయ్యారు.

## జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద 50 వాహనాల సీజ్

**సిఐ కరుణాకర్,ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్**

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాలు**

**-డి.ఎస్.పి రఘు చందర్ సూచనలు**



**జగిత్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ...**
జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, డి.ఎస్.పి రఘు చందర్ సూచనల మేరకు జగిత్యాల పట్టణంలో నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద 50 వాహనాలను సీజ్ చేస్తూ వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, నూతన నెంబర్ ప్లేట్లనే బిగిస్తూ,ఇకముందు నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల పట్టణ సిఐ కరుణాకర్ గారు పేర్కొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొనడం జరిగిందని తెలిపారు.

# మోడీవన్నీ అబద్ధాలే..





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-42 దేశాల్లో పర్యటించినా మణిపూర్ వెళ్లే ధైర్యం లేదు**

**-ఉగ్రవాదంపై అఖిలపక్షానికి ప్రధాని ఎందుకు రాలేదు?**

**-పాక్‌పై యుద్ధంలో ట్రంప్ వ్యాఖ్యల్ని ఖండించలేదు**

**-హైదరాబాద్‌కు కేంద్రం చేసిందేం లేదు**

**-మోడీ, అమిత్‌షా ఢిల్లీ నుంచి పారిపోయే రోజులు వస్తారు : సామాజిక సమరభేరిలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే**

**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ...**
ప్రధాని నరేంద్రమోడీ చెప్పేవన్నీ అబద్ధాలేనని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఆయన చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతనే ఉండదని తీవ్రంగా విమర్శించారు. ఉగ్రవాదంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని ఎందుకు రాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 42 దేశాల్లో పర్యటించిన ఆయనకు స్వదేశంలోని మణిపూర్ రాష్ట్రాన్ని సందర్శించే తీరిక, ధైర్యం లేవని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను రోడ్ల పాలు చేసి విదేశీ నాయకులను కౌగిలించుకు ఒటున్న మోడీ, కేంద్ర హొంమంత్రి అమిత్‌షా ఢిల్లీ వదిలి పారిపోయే రోజు వస్తుందని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సామాజిక సమరభేరి సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు.ప్రతిపక్ష పార్టీలతో సహా యావత్ దేశం ఒక్కటిగా నిలబడిప్పటికీ ఆపరేషన్ సింధూర్‌ను మధ్యలో ఎందుకు ఆపారని ప్రశ్నించారు. పెహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదాన్ని అంతం చేస్తామంటూ పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించిన సర్కార్ వెనుకడుగు వేసిందన్నారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని మధ్యవర్తిత్వం ద్వారా తానే ఆపానని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించుకుంటే ప్రధాని ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదని తప్పుపట్టారు. ప్రధాని మోడీకి బీహార్ ఎన్నికల ప్రచారంపై ఉన్న ఆసక్తి దేశాన్ని కాపాడటంలో లేదని విమర్శించారు. పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీది అనీ, ఆమెపై ఎన్ని వత్తిళ్లువచ్చినా లొంగకుండా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం అందించారని గుర్తుచేశారు. దేశభక్తి అంటే ఇందిరాగాంధీ చూపించిన తెగువేనన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, అనంతరం దేశ నిర్మాణం కోసం కాంగ్రెస్, గాంధీ కుటుంబం అనేక త్యాగాలు చేసిందని తెలిపారు.నాడు, నేడు ఆర్ఎస్ఎస్, బీజేపీలు దేశం కోసం ఏం త్యాగాలు చేశాయని ప్రశ్నించారు. రాజ్యాంగంలో సోషలిజం, సెక్యులరిజం పదాలు లేకుండా చేస్తామనీ బీజేపీ బీరాలు పలుకుతున్నదనీ, వాటి జోలికొస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. మోడీ సర్కార్ విదేశీ విధానం శత్రువులను పెంచే విధంగా ఉందనీ, ఇప్పటికే చైనా, పాకిస్తాన్‌తో శత్రుత్వం ఉందన్నారు. ప్రస్తుతం నేపాల్ కూడా భారతదేశానికి దూరంగా జరుగుతున్నదని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో హైదరాబాద్‌కు 50కి పైగా ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలను తీసుకొచ్చిందనీ, ఈ నగరానికి బీజేపీ ఏ చేసిందో స్పష్టం చేయాలని అన్నారు. మణిపూర్‌లో ప్రజలకు ధైర్యాన్ని కల్పించేందుకు రాహుల్‌గాంధీ ఆ రాష్ట్రంలో పర్యటించారని గుర్తు చేశారు. మోడీ ఎందుకు ఆ రాష్ట్రంలో కాలుపెట్టలేక పోతున్నారని ప్రశ్నించారు. భారత దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరం ఒక్కటిగా ముందుకు కదులుదామని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూలదో యడం అసాధ్యమనీ, బీజేపీ బలపడుతుందే తప్ప కాంగ్రెస్‌కు అవకాశం లేదన్న పరిస్థితులను హస్తం కార్యకర్తలు తారుమారు చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ఆత్మ అని అన్నారు. అర్థబలం ఉండి, స్థిరంగా పాతుకుపోయినట్టు కనిపిం చిన గత బీఆర్ఎస్ సర్కార్‌ను, కేంద్రంలో అప్పటికే అధికారంలో ఉన్న బీజేపీని కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలి పించారనీ, ఈ విజయంలో కార్యకర్త ల కష్టం ఉందని చెప్పారు. రాష్ట్రంలో పేదలు, రైతు లు, యువత, మహి ళలు అన్ని వర్గాల కోసం అనేక సంక్షేమ, ఉద్యోగ, ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తు న్నామని వివరించారు.కాంగ్రెస్ చెప్పిందే చేస్తుందనీ, దానిలో భాగంగానే గిగ్ వర్కర్ల కోసం చట్టం రూపొందించామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం బాగా పని చేస్తున్నదని ప్రశంసించారు. రాష్ట్రంలో కులగణన చేయటం ద్వారా దేశంలో అనివార్యంగా కులగణన చేసే పరిస్థితిని కాంగ్రెస్ సృష్టించిందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పోరాడుతుంద న్నారు. పార్టీకి మరింత బలాన్నిచ్చి, సామాజిక న్యాయ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సభకు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

# యమహా స్కూటర్‌పై బంపర్ ఆఫర్.. నమ్మలేని తగ్గింపుల ప్రకటన



యమహా మోటార్ భారతదేశంలో తన రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్ స్కూటర్ శ్రేణి పై పరిమిత కాల ఆఫర్‌ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా 70వ వార్షికోత్సవం సందర్భంగా కంపెనీ ఈ స్కూటర్‌పై రూ.10,000 (ఆన్-రోడ్) వరకు ధర తగ్గింపు, ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా 10 సంవత్సరాల వారంటీ ప్యాకేజీని అందిస్తోంది. ఈ ప్రమోషన్ స్కూటర్‌కు సంబంధించిన రెగ్యులర్, స్ట్రీట్ ర్యాలీ వేరియంట్లపై అందించబడుతుంది. ముఖ్యంగా స్కూటర్ ఎక్స్-షోరూమ్ ధరపై రూ.7,000 తగ్గింపు అంటే ఆన్‌రోడ్ ధరపై రూ.10 వేల వరకు తగ్గింపును అందిస్తుంది. పరిమిత ప్రమోషన్ ఆఫర్‌లో భాగంగా యమహా రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్ వేరియంట్ల ఎక్స్-షోరూమ్ ధరలు తాజాగా అప్‌డేట్ చేశారు. బేస్ డ్రమ్ వేరియంట్ ఇప్పుడు రూ.79,340 వద్ద అందుబాటులో ఉండగా డిస్క్ వేరియంట్ ధర రూ.86,430, డిస్క్ బ్రేక్లతో కూడిన టాప్-ఎండ్ హైబ్రిడ్ స్ట్రీట్ ర్యాలీ ధర రూ.92,970గా ఉంది. యమహా రేజెడ్ఆర్ స్కూటర్‌పై ధర తగ్గింపుతో పాటు ఇప్పుడు 10 సంవత్సరాల టోటల్ వారంటీతో అందిస్తున్నారు. ఇందులో 2 సంవత్సరాల ప్రామాణిక వారంటీ, ఇంజిన్, ఇంధన ఇంజెక్షన్ సిస్టమ్, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక భాగాలకు 8 సంవత్సరాల ఎక్స్‌టెండెడ్ కవరేజ్ ఉన్నాయి. వారంటీ 1,00,000 కి.మీ వరకు వర్తిస్తుంది. ముఖ్యంగా ఒకవేళ స్కూటర్ అమ్మినా తదుపరి యజమానులకు బదిలీ అవుతుంది. యమహా రేజెడ్ఆర్ 125 పై హైబ్రిడ్ ఫీచర్ల విషయానికి వస్తే 125 సీసీ ఎయిర్-కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది ఫ్యూయల్-ఇంజెక్టెడ్ ఇంజిన్ కావడం వల్ల 6,500 ఆర్‌పీఎం వద్ద 8.2 బీహెచ్‌పీ, 5,000 ఆర్‌పీఎం వద్ద 10.3 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సైలెంట్ స్టార్టప్, మెరుగైన సామర్థ్యం కోసం స్మార్ట్ మోటార్ జనరేటర్ సహాయంతో ఈ స్కూటర్ పనిచేస్తుంది. ఈ స్కూటర్ సస్పెన్షన్ పనులను ముందు టెలిస్కోపిక్ ఫోర్క్, వెనుక యూనిట్ స్వింగ్ ద్వారా చూసుకుంటుంది. ఈ స్కూటర్‌లో మెరుగైన ఇంధన ఆర్థిక వ్యవస్థ కోసం ఆటోమేటిక్ స్టాప్-స్టార్ట్ సిస్టమ్, భద్రత కోసం సైడ్ స్టాండ్ ఇంజిన్ కట్-ఆఫ్ స్విచ్, ఫుల్ డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ కన్సోల్ వంటి ఫీచర్లు ఆకట్టుకుంటాయి. కొన్ని వేరియంట్లలో వై-కనెక్ట్ సదుపాయంతో బ్లూటూత్ కనెక్టివిటీ కూడా అందుబాటులో ఉంది. అందువల్ల ఇది కాల్ అలెర్ట్స్, మెయింటెనెన్స్ అప్‌డేట్స్, ఫ్యూయల్ యూసేస్ ట్రాకింగ్, పార్కింగ్ రిమైండర్ల వంటి ఫంక్షన్ల కోసం స్మార్ట్ ఫోన్‌తో జత చేసుకోవచ్చు.

## బిజినెస్

# కొన్ని గంటల్లోనే భారీగా తగ్గిన బంగారం ధర.. ఎంతో తెలుసా..?



ఇటీవల నుంచి తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు.. గత రెండు, మూడు రోజుల నుంచి పరుగులు పెడుతోంది. ఉదయం పెరిగిన బంగారం ధరలు.. కొన్ని గంటల్లోనే భారీగా పతనమైపోయింది. దేశంలో సామాన్యులు కొనలేని పరిస్థితుల్లో బంగారం ధరలు ఉంటున్నాయి. మళ్లీ లక్ష రూపాయలకు చేరువలో ఉన్న పసిడి.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయానికి తగ్గుముఖం పట్టింది. జూలై 3న బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. అయితే, 4-6-2026 బంగారం ధర మునుపటి రోజుతో పోలిస్తే భారీగా తగ్గింది. గుడ్ రిటర్న్స్ ప్రకారం.. 4-6-2026 ఉదయం వరకు బంగారం ధర రూ.600 తగ్గింది. దీనితో, ఈరోజు దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.98,730 వద్ద కొనసాగుతుండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాములకు రూ.90,500 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.98,880కి కొనుగోలు చేయవచ్చు. ఇది రూ.600 తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,650కి చేరుకోగా, 18 క్యారెట్ల బంగారం 74,170కి చేరుకుంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములకు) ధర రూ.98,730. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,500, 18 క్యారెట్ల బంగారం రూ.74,050కి కొనుగోలు చేయవచ్చు. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములకు) ధర రూ.98,730 ఉండగా. 22 క్యారెట్ల బంగారం ధర రూ.90,500, 18 క్యారెట్ల బంగారం రూ.74,050కి కొనుగోలు చేయవచ్చు. ఇక వెండి విషయానికొస్తే కిలో వెండిపై వెయ్యి రూపాయల వరకు తగ్గుముఖం పట్టి ప్రస్తుతం కిలో వెండి ధర 1 లక్షా 10 వేల రూపాయల వద్ద కొనసాగుతోంది. ఇక చెన్నై, హైదరాబాద్, కేరళ రాష్ట్రాల్లో కిలో వెండి ధర ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం 1 లక్షా 20 వేల వరకు ఉంది.

# ఎయిర్‌టెల్‌లో ఉత్తమమైన 3 రీఛార్జ్ ప్లాన్ల గురించి మీకు తెలుసా?




భారతదేశంలో రెండవ అతిపెద్ద టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్. జియో తర్వాత దేశంలో అత్యధిక సంఖ్యలో మొబైల్ వినియోగదారులు ఎయిర్‌టెల్‌తో అనుసంధానించి ఉన్నారు. ఎయిర్‌టెల్ తన వినియోగదారులకు చాలా మంచి రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తుంది. ఇందులో లాంగ్ వాలిడిటీ నుండి షార్ట్ వాలిడిటీ వరకు, తక్కువ డేటా నుండి ఎక్కువ డేటా వరకు రీఛార్జ్ ప్లాన్‌లు ఉన్నాయి. రోజుకు 2GB డేటాతో ఎయిర్‌టెల్ రీఛార్జ్ ప్లాన్ గురించి తెలుసుకుందాం.

రూ.379 ప్లాన్: ఎయిర్‌టెల్ రూ.379 ప్లాన్ 30 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. 30 రోజుల చెల్లుబాటుతో ఉన్న ఈ ప్లాన్‌లో వినియోగదారులు అపరిమిత ఉచిత కాలింగ్, రోజుకు 2GB డేటా ప్రయోజనాలను పొందుతారు. దీనితో పాటు, రోజుకు 100 ఉచిత ల ప్రయోజనం కూడా లభిస్తుంది.

రూ.649 ప్లాన్: ఎయిర్‌టెల్ రూ.649 ప్లాన్ 56 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. 56 రోజుల చెల్లుబాటుతో ఉన్న ఈ ప్లాన్‌లో వినియోగదారులు అపరిమిత ఉచిత కాలింగ్, రోజుకు 2GB డేటా ప్రయోజనాన్ని పొందుతారు. దీనితో పాటు వారు రోజుకు 100 ఉచిత ప్రయోజనాన్ని కూడా పొందుతారు.

రూ.1029 ప్లాన్: ఎయిర్‌టెల్ రూ.1029 ప్లాన్ 84 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. 84 రోజుల చెల్లుబాటుతో ఉన్న ఈ ప్లాన్‌లో వినియోగదారులు అపరిమిత ఉచిత కాలింగ్, రోజుకు 2GB డేటా, రోజుకు 100 ఉచిత SMS ల ప్రయోజనాన్ని పొందుతారు. ఈ ప్లాన్‌లో జియో హాట్‌స్టార్ ఉచిత సభ్యత్వం కూడా ఉంది.

# చిన్ననాటి స్టయిల్‌లో బ్యాటింగ్ చేశా




**బర్మింగ్‌హామ్**

టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ ..ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. అతను 387 బంతుల్లో 269 రన్స్ చేశాడు. అయితే చిన్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేశానో, ఆ తరహాలోనే ఆడేందుకు ప్రయత్నించినట్లు అతను చెప్పాడు. టెక్నిక్‌పై ఏమైనా ఫోకస్ పెట్టారా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఐపీఎల్ ముగిసిన తర్వాత.. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు, దీనిపై చాలా వర్క్ చేసినట్లు గిల్ తెలిపాడు. బాడీ మూమెంట్‌పై ప్రధానంగా వర్క్ చేశానని, బ్యాటింగ్ బాగానే సాగుతుందని అనుకున్నానని, టెస్టుల్లో 30, 40 రన్స్ ఈజీగా చేస్తున్నాని, కానీ కీలక సమయంలో ఏకాగ్రత మిస్ అవుతున్నాని అర్థమైందని, కొన్ని సార్లు ఎక్కువ ఫోకస్ చేస్తే కూడా నష్టం జరిగే అవకాశం ఉందని గ్రహించానని, అందుకే బేసిక్ ఆటకు ప్రాధాన్యం ఇచ్చానని, చిన్నప్పుడు ఆడిన స్టయిల్‌లో ఆడానని, లాంగ్ ఇన్నింగ్స్‌పై దృష్టి పెట్టకుండా, బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేసినట్లు చెప్పాడు.గతంలో ఇంగ్లండ్ పిచ్‌లపై ఇండియన్ బ్యాటర్ సునీల్ గవాస్కర్ అత్యధికంగా 221 రన్స్ చేశాడు. 1979లో అతను ఓవల్ మైదానంలో ఆ రికార్డు క్రియేట్ చేశాడు. అయితే ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా ఇప్పుడు గిల్ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. కొన్ని సందర్భాల్లో ఈజీగా పరగులు రాబట్టలేని పక్షంలో.. బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేయడం ఇబ్బందిగా మారుతుందని, రన్స్ కోసం ఎక్కువగా ఫోకస్ చేయాల్సి వస్తుందని, ఎక్కువగా ఫోకస్ పెట్టడం వల్ల బ్యాటింగ్ ఎంజాయ్ చేయలేకపోయానని గిల్ తెలిపాడు. మొదటి రోజు లంచ్ ముందు బ్యాటింగ్ చేయడానికి వెళ్లినప్పుడు, టీ విరామ సమయంలో తాను 40 రన్స్ వరకు స్కోర్ చేశానని, ఫ్రీగా రన్స్ స్కోర్ చేయలేకపోతున్న విషయాన్ని కోచ్ గంభీర్‌కు చెప్పానని తెలిపాడు. ఫస్ట్ టెస్టు మ్యాచ్‌లో ఈజీగా రన్స్ స్కోర్ చేశానని, కానీ ఈసారి బ్యాటింగ్ టఫ్‌గా ఉన్నా.. తన వికెట్‌ను వదలుకోవద్దు అన్న ఆలోచనలో ఉన్నానని, ఎందుకంటే టేయిలెండర్లు వరుసగా వికెట్లు చేజార్చుకునే అవకాశం ఉందని, ఆ ఛాన్స్ ఇవ్వకూడదన్న ఉద్దేశంతో బర్మింగ్‌హామ్‌లో బ్యాటింగ్ చేసినట్లు గిల్ తెలిపాడు.

## స్పోర్ట్స్

# బంగ్లాదేశ్ పర్యటనపై అనిశ్చితి..

### టీ20 వరల్డ్ కప్ ప్రాక్టీస్ సంగతేంటీ..!




ఇంగ్లండ్ పర్యటన తర్వాత భారత క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ 2026 సన్నాహక మ్యాచ్‌లతో బిజీగా ఉండనుంది. అయితే.. టీమిండియా, బంగ్లాదేల మధ్య జరగాల్సిన సిరీస్‌పై సందిగ్ధం నెలకొంది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టులో బంగ్లాదేశ్ గడ్డపై భారత జట్టు వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకూ భారత క్రికెట్ నియంత్రణ మండలి నుంచి ఎటువంటి స్పందన లేదు. అయితే.. బంగ్లాదేశ్ బోర్డు మాత్రం సిరీస్‌ను రీషెడ్యూల్ అవుతుందనే నమ్మకంతో ఉంది. ఇరుదేశాల మధ్య సఖ్యత లేనందున రెండు జట్ల మధ్య జరగాల్సిన ఆరు మ్యాచ్‌ల వైట్ బాల్ సిరీస్ రద్దు అవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి.నిరుడు బంగ్లాలో చెలరేగిన అల్లర్లలో హిందువుల ఊచకోత అనంతరం.. ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు స్తంభించాయి. బంగ్లాలో తయారైన రెడీమెడ్ దుస్తులు, ప్రాసెస్డ్ ఫుడ్‌పై భారత ప్రభుత్వం పరిమితులను ప్రకటించింది. ఈ ప్రభావం ద్వైపాక్షిక సిరీస్ నిర్వహణపై పడింది.ముందస్తుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనకు భారత జట్టు వెళ్లాల్సింది. పొట్టి ప్రపంచకప్ సంసిద్ధత కోసం అక్కడ మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సింది. కానీ, ఇప్పుడు సిరీస్‌పై నీలినీడలు కమ్ముకున్నాడు. దాంతో.. టీమిండియా ప్రాక్టీ మ్యాచ్‌లు లేకుండానే వచ్చే ఏడాది జరుగబోయే పొట్టి వరల్డ్ కప్ ఆడాల్సి రావచ్చు. ఇండియా చివరిసారిగా జనవరిలో ఇంగ్లండ్‌తో పొట్టి సీరీస్ ఆడింది.

# మాజీ వరల్డ్ నంబర్ 1కు షాక్.. తొలిసారి నాలుగో రౌండ్‌లో రష్యన్ స్టార్



వింబుల్డన్‌లో ఫేవరెట్లకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో నవోమి ఒసాకా అనూహ్యంగా మూడో రౌండ్‌లోనే వెనుదిరిగింది. మూడేళ్ల తర్వాత వింబుల్డన్ ఆడుతున్న ఈ మాజీ వరల్డ్ నంబర్ 1కు అనస్టాసియా పవ్లిచెంకోవా(రష్యా) షాకిచ్చింది. మూడు సెట్లపాటు హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో ఒసాకా తొలి సెట్ గెలుపొందినప్పటికీ అదే జోరు చూపలేకపోయింది. రెండో సెట్‌లో పుంజుకున్న అనస్టాసియా విజేతగా నిలిచింది. దాంతో ఉసూరుమంటూ నిష్క్రమించింది ఆసియా టెన్నిస్ స్టార్.నాలుగు గ్రాండ్‌స్లామ్స్ విజేత ఒసాకా వింబుల్డన్‌లో మూడో రౌండ్ దాటలేకపోయింది. 53వ ర్యాంకర్ అనస్టాసియా ధాటికి నిలువలేకపోయింది. తొలి సెట్‌ను ఒసాకా 3-6తో సులువుగా గెలుపొందింది. ఆ తర్వాత అనస్టాసియా తన అసలైన గేమ్‌తో విరుచుకుపడి 6-4, 6-4తో రెండు సెట్లలో పైచేయి సాధించింది. తదుపరి రౌండ్‌లోనూ ఇదే ఉత్సాహంతో చెలరేగాలని భావిస్తున్నట్టు చెప్పిందీ 2021లో ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ అయిన రష్యా క్రీడాకారిణి. తొమ్మిదేళ్లలో అనస్టాసియా నాలుగో రౌండ్‌కు చేరడం ఇదే తొలిసారి.




## విశ్వంభర'లో ఊహించని ట్విస్ట్..

### చిరు పాటనే రీమిక్స్ చేయబోతున్న మేకర్స్?

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం విశ్వంభర సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. సోషియో–ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఓ రీమిక్స్ సాంగ్ ఉండబోతోందని ప్రచారం జరుగుతోంది.తాజా సమాచారం ప్రకారం, చిరంజీవి నటించిన సూపర్ హిట్ సినిమాలోని ఏదైన ఒక పాటను 'విశ్వంభర' సినిమాలో రీమిక్స్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ సోషల్ మీడియాలో దీనిపై పెద్ద చర్చ జరుగుతోంది. బాలీవుడ్ నటి మౌని రాయ్ ఈ స్పెషల్ సాంగ్ లో చిరంజీవితో కలిసి స్టెప్పులు వేయనున్నారని కూడా సమాచారం. 'విశ్వంభర' సినిమాకు ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

## కన్నప్ప కోసం..

## శారీరకంగా ఎంతో కష్టపడ్డా



శ్రీ విష్ణు ఓం భీం భుష్ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి తెలుగు ప్రేక్షకులను అలరించింది తమిళ ముద్దుగమ్మ ప్రీతి ముకుందన్ . ఆపై కెవిన్‌తో స్టార్ చిత్రంతో నటి గాను గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు ఇటీవల కన్నప్ప సినిమాతో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. ఆ సినిమాలో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్‌లో చివరకి వరకు కనిపించిన ఈ భామ నటనతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా మూవీలోని పాటలు అందులోని డ్రెస్సింగ్‌తో టాక్ ఆఫ్ ది టౌన్ అయింది. చాలాకాలం సోషల్ మీడియాను షేక్ చేసింది కూడా.ఇదిలాఉంటే.. సినిమా టీజర్ రిలీజ్ సమయంలో ఏడాది క్రితం కనిపించిన ఈ చెన్నై చిన్నది ఆపై మళ్లీ ఇంతవరకు కనిపించిన దాఖాలాలు లేవు. దేశమంతా నిర్వహించిన సినిమా ఈవెంట్లలో ప్రధానంగా హైదరాబాద్ ప్రీ రిలీజ్‌లోనూ హీరో, పలువురు నటులు సందడి చేసినప్పటికీ హీరోయిన్ దర్శణం ఇవ్వలేదు. దాంతో మేకర్స్‌తో ఎదో ఇష్యూలు వచ్చాయని న్యూస్ వైరల్ అయింది. ఈ నేపథ్యంలోనే సినిమా విడుదల కావడం మంచి విజయం సాధించడం చకచకా జరిగిపోయాయి.ఈ సందర్భంగా అనేక మంది ప్రీతి నటనను మెచ్చుకుంటూ ప్రశంసలతో ముంచెత్తుతుండడంతో అమ్మడి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దాంతో ప్రీతి అందరికీ థ్యాంక్స్ చెబుతూ తన అనుభవాలను చెబుతూ ఓ పోస్ట్ పెట్టింది.ఆరు నెలలు ఆ పాత్ర కోసం శారీరకంగా ఎంతో కష్టపడ్డానని, ఇప్పుడు వచ్చిన ఫలితం ఎతో గొప్పగా ఉందని తెలిపింది. అయితే అందులో కన్నప్ప సినిమాను, నటుల పేర్లను ఎక్కడా ప్రస్తావించకుండా తన గురించి మాత్రమే చెప్పడంతో ఆ యూనిట్‌కు, ప్రీతి మధ్య సమ్‌థింగ్ ఏదో జరిగిందనే వార్తలకు బలం చేకూరిన్నట్లైంది.అయితే.. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ కన్నప్పసినిమా తరహా దుస్తులను ధరించి రకారకాల భంగిమలతో హొయలు పోతూ హంగామా చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉండగా టాలీవుడ్, బాలీవుడ్ ఈ అమ్మడికి మరిన్ని ఛాన్సలు ఇవ్వాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. ప్రీతి కొత్త ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి.

## పాయల్ రాజ్ పుత్ సైలెంట్ అయ్యిందే..

## ఆఫర్స్ రావడం లేదా..? గ్యాప్ తీసుకుందా..?




పాయల్ రాజ్ పుత్.. ఈ ముద్దుగుమ్మ తెలుగులో మొత్తం 12 సినిమాల్లో నటిస్తే కేవలం రెండు మాత్రమే హిట్టయ్యాయి. యంగ్ హీరో కార్తికేయ సరసన ఆర్‌ఎక్స్ 100 మూవీతో తెలుగు తెరకు పరిచయమైంది. తొలి సినిమాతోనే కుర్రాళ్ల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన ఈ సినిమా భారీ వసూళ్లు రాబట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసిన ఈ వయ్యారి.. తొలి చిత్రంలో ఓ రేంజ్ రొమాంటిక్ సన్నివేశాల్లో కనిపించింది. ఫస్ట్ మూవీ హిట్టైనా ఆ తర్వాత మాత్రం వరుసగా నిరాశపరిచాయి. ఎన్టీఆర్: కథానాయకుడు,RDXలవ్, వెంకీమామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, తీస్ మార్ ఖాన్, మాయపేటిక, మంగళవారం వంటి చిత్రాల్లో నటించింది. కానీ వీటిలో మంగళవారం సినిమా తప్ప మిగిలినవేవి హిట్ కాలేదు. తెలుగుతోపాటు కన్నడ, పంజాబీలో పలు చిత్రాల్లో నటించింది. కానీ అక్కడ సైతం నిరాశే ఎదురైంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి. అందాల ఆరబోతతో కుర్రకారును కవ్విస్తుంది పాయల్ రాజ్ పుత్. అందంతో పాటు నటనకు మంచి మార్కులు పడ్డప్పటికీ ఈ చిన్నదానికి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. దాంతో సోషల్ మీడియాలోనే ఎక్కువగా సందడి చేస్తుంది ఈ చిన్నది. ఈ క్రమంలోనే కొన్ని ఫోటోలు షేర్ చేసింది. ఈ ఫోటోలు నెటిజన్స్ ను కవ్విస్తున్నాయి.



## అనుష్క 'ఘాటీ'

## విడుదల మళ్ళీ వాయిదా?

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే సూచనలు మళ్లీ కనిపిస్తున్నాయి. గతంలో 'వేదం' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని మొదట ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత, మేకర్స్ అధికారికంగా జులై 11న సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే షూటింగ్ కూడా పూర్తి చేశారు.అయితే, తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో, 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందని యూనిట్ వర్గాలు వెల్లడించాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కొత్త విడుదల తేదీగా ఆగస్టు 27ను నిర్మాతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనుష్క అభిమానులు 'ఘాటీ' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, సినిమా విడుదల ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492